RNI NO: TELTEL/2023/87917

# జనం వెలుగు

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

అనునిత్యం అక్షరసత్యం

సంపుటి: 03 సంచిక: 64 శనివారం 17 మే 2025 ఎడిటర్: సీతార్ల సురేష్ పేజీలు: 8

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

## రేషన్ బియ్యం అమ్ముకుంటే కష్టాలే

**జనంవెలుగు, అదిలాబాద్:–** ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడానికి రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుండగా కొందరు లబ్ధిదారులు, డీలర్లు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారు. దొడ్డు బియ్యం పంపిణీలో మొదలైన ఈ అక్రమాలు సన్న బియ్యం పంపిణీలోనూ కొనసాగుతున్నాయి. లబ్ధిదారులు బియ్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారు. అధికారులు అక్రమాలకు పాల్పడిన లబ్ధిదారుల రేషన్ కార్డులను రద్దు చేస్తున్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా వినియోగించుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. పేద ప్రజల ఆకలి తీర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఎంతో ప్రతిష్టాత్మకంగా సీఎం రేవంత్ రెడ్డి దీనిని సూర్యాపేట జిల్లాలో ఉగాది పర్వదినాన ప్రారంభించారు. దీని ద్వారా ఎంతో మంది పేదలు సంతోషంగా ఉన్నారు. దొడ్డు బియ్యం బదులు సన్న బియ్యం ఇవ్వడంతో తమకు ఆర్థికంగా కూడా ఎంతో భరోసా కల్పిస్తున్నట్లు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనిలో కొందరు మాత్రం అక్రమాలకు పాల్పడుతూ బియ్యాన్ని అమ్మేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మొదట్లో సరఫరా చేసిన దొడ్డు బియ్యంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ అవకతవకలకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో సన్న బియ్యం పంపిణీని ప్రారంభించింది. అయినప్పటికీ అక్రమార్కుల తీరు మాత్రం మారలేదు. వారు ఇప్పటికీ అడ్డదారులు వెతుక్కుంటూ, తమ పని కానిచ్చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారుప్రభుత్వం ప్రతి నెల రేషన్ డీలర్లకు సకాలంలో బియ్యం సరఫరా చేస్తుంది. అయితే.. బియ్యం అవసరం లేని లబ్ధిదారులు, రేషన్ డీలర్లు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారు. బియ్యం వద్దనుకునే లబ్ధిదారులు డీలర్లతో ముందుగానే ఒక అవగాహనకు వస్తారు. లబ్ధిదారులు దుకాణానికి వెళ్ళిన వెంటనే డీలర్ వారికి బియ్యం కావాలా, డబ్బులు కావాలా అని అడిగి, ఏదో ఒకటి గుట్టుచప్పుడు కాకుండా సర్దుబాటు చేస్తారు. కొందరు లబ్ధిదారులు బయోమెట్రిక్ యంత్రంపై వేలిముద్ర వేసి డబ్బులు తీసుకుంటున్నారు. దొడ్డు బియ్యం తరహాలోనే సన్న బియ్యంలో కూడా అక్రమాలు కొనసాగుతున్నాయి. సన్న బియ్యం రుచిగా లేవని కొందరు, దొడ్డు బియ్యం తింటేనే కడుపు నిండుతుందని నమ్మే శ్రామికులు వాటిని దళారులకు కిలోకు రూ. 25–30 చొప్పున అమ్ముకుంటున్నారు. ఈ పరిస్థితి చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఈ అక్రమాలలో డీలర్ల తప్పు ఎంత ఉందో, లబ్ధిదారుల ప్రమేయం కూడా అంతే స్థాయిలో ఉందని చెప్పవచ్చు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వాటిలోని లోపాలు, పర్యవసానాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తే ఇలాంటి అక్రమాలను నివారించవచ్చు. మంచిర్యాల జిల్లా, తాండూరు మండలంలోని అచ్చలాపూర్‌లో అధికారులు 11 మంది లబ్ధిదారుల రేషన్ కార్డులను రద్దు చేశారు. వీరు దళారులకు బియ్యం



విక్రయించినట్లు గుర్తించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రేషన్ కార్డు ఒక ముఖ్యమైన పత్రంగా పరిగణించబడుతోంది. అనేక సంక్షేమ పథకాలకు ఇది ప్రామాణికంగా ఉపయోగపడుతుంది. అలాంటిది రద్దు అయితే.. లబ్ధిదారులు అనేక పథకాలు కోల్పోవాల్సి వస్తుంది. కళ్యాణలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ళు, పింఛన్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రం..ఇతర ముఖ్యమైన పత్రాల కోసం కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.కాబట్టి, లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా వినియోగించుకుంటేనే ప్రయోజనకరంగా ఉంటుంది. అక్రమాలకు పాల్పడే రేషన్ డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని నిర్మల్ జిల్లా ఇన్చార్జి డిఎస్ఓ కోమల్ రెడ్డి హెచ్చరించారు. సంక్షేమ పథకాలను లబ్ధిదారులు తమ కుటుంబ సంక్షేమం కోసం మాత్రమే ఉపయోగించాలని, లబ్ధిదారులు బియ్యం విక్రయిస్తే వారి రేషన్ కార్డులను రద్దు చేయడంతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## నేడు ప్రపంచ టెలి కమ్యూనికేషన్, సమాచార సొసైటీ దినోత్సవం

**జనంవెలుగు:–** ప్రపంచ టెలి కమ్యూనికేషన్, సమాచార సొసైటీ దినోత్సవం ప్రతి సంవత్సరం మే 17న నిర్వహించబడుతుంది. సాంకేతికత (టెక్నాలజీ) ద్వారా వచ్చే అవకాశాలపై అవగాహన పెంచడంకోసం ఈ దినోత్సవం జరుపుకుంటారు.టెలి కమ్యూనికేషన్ దినోత్సం: మొదటిసారిగా మే 17, 1968లో ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవం జరుపుకున్నారు. మే 17న అంతర్జాతీయ టెలిగ్రాఫ్ యూనియన్ స్థాపించారు. అలాగే మొదటి అంతర్జాతీయ టెలిగ్రాఫ్ కన్వెన్షన్‌పై 1865 మే 17న పారిస్‌లో సంతకం చేశారు. అందువల్ల మే 17ను ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవంగా ప్రకటించారు.సమాచార సొసైటీ దినోత్సవం: 2005లో ట్యూనిస్‌లోని ఇన్ఫర్మేషన్ సొసైటీపై ప్రపంచ శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ సమాచార సొసైటీ దినోత్సవం జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య తీర్మానం ద్వారా ప్రకటించబడింది. 2006, నవంబరులో టర్కీలోని అంటాల్యాలో జరిగిన అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ ప్లీనిపోటెన్షియరీ కాన్ఫరెన్స్ లో ఈ రెండింటిని కలిపి ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ టెలి కమ్యూనికేషన్, సమాచార సొసైటీ దినోత్సవంగా




జరుపుకోవాలని ప్రకటించబడింది.సుదూర ప్రాంతాల మధ్య దూరాన్ని తగ్గంచేలా కమ్యూనికేషన్‌ని వ్యాప్తి చేయడమే ఈ దినోత్సవం ముఖ్యోద్దేశం. మన జీవితంలో కమ్యూనికేషన్ ఎంత కీలకమైనదో అవగాహన పెంచడం, ఈ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధిపరచడం వంటివి ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యాలు.

## రైతులకు అలర్ట్ ఈనెల 23వ తర్వాత రైతు భరోసా

**జనంవెలుగు, హైదరాబాద్:–** తెలంగాణ రాష్ట్ర రైతన్నలకు అలర్ట్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పై కీలక అప్డేట్ వచ్చింది. ఈనెల 23 తర్వాత రైతుల ఖాతాలలో రైతు భరోసా నిధులు వేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో చాలావరకు రైతు భరోసా డబ్బుల పెండింగ్ ఉన్న సంగతి తెలిసిందే. అయితే పెండింగ్ లో ఉన్న రైతు భరోసా సహాయాన్ని.. ఈనెల 23 తర్వాత జమ చేసేందుకు రంగం సిద్ధం చేసింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. ఇప్పటివరకు మూడున్నర ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందించింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఇక ఈ నెల 23వ తేదీ తర్వాత నాలుగు ఎకరాలు, ఆపైన ఉన్నవారికి కూడా నగదు జమ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇక ఈ





రైతు భరోసా, కింద రెండు విడతల్లో 6000 రూపాయల చొప్పున 12000 ఇస్తున్నారు.

### శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవం



**జనంవెలుగు, నందిపేట్:–** నందిపేట్ మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయంలో యంత్ర, మూర్తి, శిఖర, ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ మహోత్సవంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు సిలిండర్ లింగం, మన్నే సాగర్, మేర శ్రీను, కంతం చిన్నయ్య, ఐలాపూర్ రాజు, జెమిల్, ఆర్మూర్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఇస్సాపల్లి జీవన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఖాందేశ్ శ్రీనివాస్, మారుతి రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ



**జనంవెలుగు, డొంకేశ్వర్:–** డొంకేశ్వర్ మండలం నికాల్పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించబడిన శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో కూడా ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డొంకేశ్వర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమేష్ రెడ్డి, నాయకులు సుమన్, జలపతి రావు, నందిపేట్ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఇస్సాపల్లి జీవన్, ఖాందేశ్ శ్రీనివాస్, మారుతి రెడ్డి, మురళి పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమిపూజ



**జనంవెలుగు, నందిపేట్:–** జోర్పూర్ గ్రామంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుడు ప్రవీణ్ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి ముగ్గు వేయడం జరిగింది. ఈ కార్యక్రమం ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు, నందిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ నేతృత్వంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సదానంద్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తోగరి సాయిలు, కనుక గౌడ్, వినీత్, దేవేందర్, మహేందర్, నవీన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సాయికుమార్, రమేష్, ప్రమీల, గంగాధర్ పాల్గొన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా నాణ్యమైన పనులు జరుగుతాయనీ, లోపాలు లేకుండా పర్యవేక్షణ కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

### పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీ - బాధితులకు అప్పగింత



**జనంవెలుగు, భీంగల్:–** భీంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పోయిన మొబైల్ ఫోన్లను భీంగల్ ఎస్ఐ మహేష్ నేతృత్వంలో గుర్తించి బాధితులకు తిరిగి అందజేశారు. మొబైల్ ఫోన్లను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన CEIR (Central Equipment Identity Register) పోర్టల్ ద్వారా గుర్తించి, మొత్తం ఆరు ఫోన్లను రికవరీ చేయడంలో పోలీసులు విజయవంతమయ్యారు. రికవరీ అయిన ఫోన్లు బాధితులకు ప్రత్యేక కార్యక్రమంలో అప్పగించబడినాయి. ప్రసాద్, రాజన్నలు చెంగల్వారు కాగా వెంకట్ రామ్ రెడ్డి, టేకు రామ్, శైక్ అహ్మద్ హరీష్ లు బింగల్ కు చెందిన వారు. పోలీసులు ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, వారి విలువైన వస్తువులను తిరిగి పొందేందుకు నిరంతరం కృషి చేస్తుండటంపై బాధితులు హర్షం వ్యక్తం చేశారు. భీంగల్ పోలీస్ శాఖ సేవలను ప్రశంసిస్తూ, ఎస్ఐ మహేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.